డీలర్ల ఇష్టారాజ్యం..!

- యూరియా కొరత సృష్టించి, ఇతర ఎరువులు అంటగడుతున్న వైనం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు


వాహనంలో తీసుకెళ్తున్న ఎరువులు

చెన్నూర్: ఆరుగాలం శ్రమించే రైతులకు విత్తనాల దగ్గర నుంచి ఎరువుల సేకరణ వరకు కష్టాలు తప్పడం లేదు. అవసరాలను ఆసరాగా చేసుకొని ఎరువుల డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. అవసరం లేని ఎరువులను అంటగడుతూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెన్నూర్ ప్రాంత రైతులకు జూన్, జూలై నెలలకు సరిపడా యూరియా వచ్చిందని, ఎక్కడా యూరియా కొరత లేదని అధికారులు చెబుతుండగా, కొందరు డీలర్లు యూరియా కొరతను సృష్టించి ఎఫ్ 20, 28:28 ఎరువులు అంటగడుతున్నారని పేర్కొంటున్నారు. షాపులపై అధికారుల పర్యవేక్షణలోపం కారణంగానే డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఎరువుల షాపులపై నిఘా పెట్టాలని కోరుతున్నారు.

అప్పు చేసి సాగు చేస్తున్నా..

చెన్నూర్ పట్టణంలోని గ్రోమోర్ ఎరువుల షాపులో 10 యూరియా ఎరువుల కోసం పోతే రూ.7వేల విలువ గల అవసరం లేని ఎరువులను అంటగట్టారు. నా దగ్గర డబ్బులు లేవంటే వినకుండా నన్ను ఇబ్బంది పెట్టారు. జిల్లా వ్యవసాయ అధికారులు స్పందించి డీలర్లు రైతులకు ఎరువులు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలి.

\- చింతల రాజు, రైతు, సుద్దాల

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించం..

రైతులను డీలర్లు ఇబ్బందులకు గురిచేస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తాం. గ్రోమోర్‌లో యూరియాకు బదులుగా, వేరే ఎరువులు అమ్ముతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వెంటనే అందులో అమ్మకాలను నిలిపివేశాం. చెన్నూర్ డివిజన్‌కు 9932మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉంది. ఇప్పటి వరకు 2310మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయి. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

\- బానోత్ ప్రసాద్, ఏడీ, చెన్నూర్

ఒకే భవనం.. మూడు కార్యాలయాలు



- ఇబ్బందికరంగా కార్యకలాపాలు

తాండూర్: ఈ చిత్రంలో కనిపిస్తున్నది తాండూర్ మండల విద్యావనరుల కేంద్రం భవన సముదాయం. కానీ నేడు ఆ ఒక్క భవనంలో మండల విద్యావనరుల కేంద్రం, రాజీవ్‌నగర్ గ్రామపంచాయతీ కార్యాలయం, దివ్యాంగుల కోసం భవిత కేంద్రం ఇలా మూడు తమ ప్రభుత్వ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. అసలే చిన్న భవనం.. ఆపై మూడు కార్యాలయాలు అంటే ఎంత ఇరుకుగా, అరకొరగా తమ కార్యకలాపాలు కొనసాగించాల్సి వస్తుందో అర్థం చేసుకోవచ్చు. కొత్తపల్లి మేజర్ గ్రామపంచాయతీ నుంచి వేరుపడిన తర్వాత రాజీవ్‌నగర్ నూతన గ్రామ పంచాయతీగా ఆవిర్భవించినప్పటి నుంచి ఆరున్నర సంవత్సరాలుగా ఇదే భవనంలో గ్రామపంచాయతీ కార్యాలయం కొనసాగుతుంది. నూతన గ్రామపంచాయతీ భవనంలో గ్రామపంచాయతీ కార్యాలయానికి భూమిపూజ చేసినప్పటికీ, నేటికి నిర్మాణ పనులు మొదలు కాలేదు. ప్రత్యామ్నాయంగా వేరే చోట గ్రామపంచాయతీ కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇరుశాఖల వారికి ఇబ్బందికర పరిస్థితులే నెలకొన్నాయి. నిత్యం పాఠశాల నివేదికలు సమర్పించేందుకు, సమావేశాలకు వచ్చే ఉపాధ్యాయులు ఈ ఇరుకు గదులతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కార దిశగా చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులు, అధికారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

డయేరియాపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జిల్లాలో డయేరియా ప్రబలకుండా ఉండేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలని మంచిర్యాల డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత అన్నారు. జిల్లా కేంద్రంలోని హమాలివాడ బస్తీ దవాఖానాలో బుధవారం డయేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించి, ఓఆర్‌ఎస్, జింక్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అవగాహన కల్పించారు.

కూరగాయల మార్కెట్ ఎత్తివేయాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ బాబు క్యాంపు బస్తీకి వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్ హాల్ స్థలంలో అనధికారికంగా నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను ఎత్తివేయాలని తెలంగాణ మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌కు బుధవారం వినతిపత్రం అందజేసి సమస్య తీవ్రతపై చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కుంబాల రాజేష్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు అంగూరి సుభాష్, గౌరవ అధ్యక్షుడు సొత్కు శ్రీనివాస్, నాయకులు కొమురయ్య, మధు, చక్రధర్, ఆకాశ్, సతీష్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రొడక్ట్స్ ఫెస్టివల్


ఫుడ్‌ప్రొడక్ట్స్ ప్రదర్శిస్తున్న మెప్మా సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం 100రోజుల కార్యక్రమంలో భాగంగా ఇందిరా మహిళా శక్తి యూనిట్ ద్వారా ఉపాధి పొందిన స్వయం సహాయక సంఘ సభ్యులతో ఫుడ్ ప్రొడక్ట్స్ ఫెస్టివల్ నిర్వహించారు. కమిషనర్ సంపత్‌కుమార్, మేనేజర్ కరుణాకర్ ఫెస్టివల్‌ను ప్రారంభించగా, మెప్మా సభ్యులు తయారు చేసిన పలు రకాల ఫుడ్‌కు సంబంధించినవి, ప్రొడక్ట్స్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ ప్రభుదాస్, టీఎంసీ చంద్రయ్య, సీవోలు సుజాత, అరుణ, సరోజ, డీఈవో సునిత, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, ఆర్పీలు పాల్గొన్నారు.


భారీ వాహనాలు అనుమతించాలని రిలే దీక్ష

జన్నారం: జన్నారం మండల కేంద్రం మీదుగా పగటిపూట భారీ వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి బుధవారం రిలే నిరహార దీక్ష చేపట్టాడు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట రిలే దీక్ష చేపట్టగా పలువురు నాయకులు, బీసీ సంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, బీసీ సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, ప్రభాకర్, తదితరులు మద్దతుగా పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

పాతమంచిర్యాల: ఇండియన్ కరెన్సీపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు పరశురాం అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దేశ ప్రధానికి లక్ష పోస్టు కార్డుల వినతులను పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి జాతీయ సహాయ కార్యదర్శి పలిగిరి కనకరాజు, ఉపాధ్యక్షుడు బొల్లి స్వామి, దళిత బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి యువకుడికి పీహెచ్‌డీ పట్టా


పట్టాతో మురళీకృష్ణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ బూడిద గడ్డ బస్తీకి చెందిన కంబాల మురళీకృష్ణ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయం బుధవారం నిర్వహించిన రెండో కాన్వకేషన్ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పట్టాను ప్రదానం చేశారు.

‘కూల్చివేతలతో నిధులు దుర్వినియోగం’


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కూల్చివేయడం సరికాదని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వాటిని కూల్చడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంతో పాటు, ఐబీలో నిర్మించిన గెస్ట్‌హౌస్, జిల్లా కేంద్రంలోని జంక్షన్ల కూల్చివేతతో దాదాపు రూ.15కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందన్నారు. ఈ ఏడాది జనవరి 3న జరిగిన పురపాలక సమావేశంలో స్వయంగా ఎమ్మెల్యే పాల్గొని, జంక్షన్లు పెద్దగా ఉండడం వల్ల తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి వెడల్పు తగ్గిస్తామని చెప్పి, అందుకు అనుగుణంగా తీర్మానం కూడా చేశారన్నారు. కానీ ప్రస్తుతం ఆయా జంక్షన్లను పూర్తిగా లేకుండా తొలగించడంలో మతలబేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయా జంక్షన్లను నిర్మించేందుకు అప్పటి అధికారులకు లేని అభ్యంతరం, వాటిని తొలగించేందుకు ఎందుకు వచ్చిందో అధికారులకే తెలియాలని, సరైన అనుమతులు లేకుండానే ఎమ్మె ల్యే చెప్పిందే తడవుగా రూల్స్‌కు విరుద్ధంగా కూల్చి వేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను, ప్ర జల సొమ్మును కాపాడాల్సిన అధికారులే రాజకీయ ఒత్తిళ్లకు తలవంచి, కూల్చివేతలకు సహకరిస్తున్నారని, ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బేర సత్యనారాయణ, వంగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల ‘పొలంబాట’

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామంలో మండల విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సిబ్బంది రైతులతో కలిసి పొలాల్లో తిరుగుతూ వంగిన విద్యుత్ స్తంభాలను సరిచేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్, లూస్ లైన్స్ సరిచేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ.. రైతులు మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలని, వాటి ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ కైసర్, ఏడీఈ ప్రభాకర్, ఏఈ గణేశ్, రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వీయ రక్షణతో పనిచేయాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: ప్రతీ ఉద్యోగి స్వీయ రక్షణతో పని చేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్ వీటీసీలో బుధవారం ఈపీ ఆపరేటర్లకు, ఎంవీ డ్రైవర్లకు సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్ అమలుపై రెండు రోజుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. గనుల ప్రమాదాల నివారణకు సీఎంఆర్ 2017చట్టంలో నిర్దేశించిన రెగ్యులేషన్స్ ప్రకారం సేఫ్టీ మేనేజ్మెంట్ ప్లాన్‌ను తయారు చేసినట్లు తెలిపారు. వీటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎవరి పనిని ఏ విధంగా చేయాలి, లోటుపాట్లు కనిపిస్తే గమనించి సూపర్‌వైజర్ తగిన భద్రత చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్ మాట్లాడుతూ.. ప్రమాద రహిత సింగరేణి లక్ష్యంగా పనిచేయాలన్నారు. రక్షణ నియమాలు, సూత్రాలు పాటిస్తూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బ్రాంచీ షేక్ బాజీసైదా, సిమ్టార్స్ ఇన్‌చార్జి విజయకుమార్, వీటీసీ మేనేజర్ కమ్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

‘జిల్లా అభివృద్ధికి పోరాడుతాం’



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

చెన్నూర్: జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజల పక్షాన నిలిచి నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బడికెల మధునయ్య అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌలుతో కలిసి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నెన్నెల సమ్మయ్య, సుంకరి చందు, సూత్రం నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుల ఎంపికపై విద్యార్థులకు అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్య విద్యార్థులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థులు బుధవారం గర్మిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు భవిష్యత్‌లో ఎలాంటి చదువులు ఎంపిక చేసుకోవాలని, 9వ తరగతి విద్యార్థులకు ఆడపిల్లల్లో వచ్చే మార్పులు, అందుకు సంబంధించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య విద్యార్థులు వివేక్, సాకేత్, తనీష్, హరి రాఘవేంద్ర, హకీం, సశ్వత్, సాయిరెడ్డి, వైభవి, శివాని, దివ్య, గాయత్రి, త్రిష, మానస, కుసుమ, ధరణి, ప్రవల్లిక, గ్రేస్ పాల్గొన్నారు.

సమాచారం

- **నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం**

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థకు మంచినీటి సరఫరా చేసే ముల్కల్ల పంపుహౌస్, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయనున్నందున 17వ తేదీ సాయంత్రం, 18వ తేదీ ఉదయం పూట మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచినీటి సరఫరా అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

- **దరఖాస్తుల ఆహ్వానం**

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ సివిక్స్/పొలిటికల్ సైన్స్ సబ్జెక్టును గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు తమస్టడీ సర్టిఫికెట్లతో ఈ నెల 19లోగా పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

- **నేడు ఆయుర్వేద వైద్య శిబిరం**

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో గురువారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షి అందుబాటులో ఉంటారని ఏరియా కార్మికులు, కార్మిక కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

ఆధ్యాత్మికం

- **ఘనంగా మండల పూజలు**


హోమంలో పాల్గొన్న భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా మండల పూజలు నిర్వహించారు. ఆలయ ఏర్పాటుకు ప్రధాన దాతగా వ్యవహరించిన పద్మశ్రీ-సత్యనారాయణ దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు బేర పద్మ-పోచయ్య దంపతులు హోమం తదితర పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వనమాల నాట్యమండలి ఆధ్వర్యంలో నృత్య కళాకారులు కూచిపూడి నాట్య ప్రదర్శన నిర్వహించగా భక్తులను ఆకట్టుకుంది. కమిటీ సభ్యులు పెద్దపల్లి స్వామి, ఆకిరెడ్డి వెంకటేశ్, అత్తె తిరుపతి, కారుకూరి తిరుపతి, గోపు లింగయ్య, భక్తులు పాల్గొన్నారు.

- **ఘనంగా కొండ పోచమ్మ బోనాలు**

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల శివారులోని శ్రీ బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయ సమీపంలోని శ్రీ కొండ పోచమ్మ అమ్మవారి బోనాలు బుధవారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి భక్తులు నైవేద్యాలు, వస్త్రాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో రాజేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీదేవి, కన్నాల మాజీ సర్పంచ్ స్వరూప, భక్తులు పాల్గొన్నారు.

- **పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన**

నెన్నెల: మండలంలోని ఆవుడం పోచమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఇంటింటి బోనాన్ని అమ్మవారికి సమర్పించి మంగళహారతులు, నైవేద్యాలతో ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు.

- **నాగాపూర్‌లో చిన్నన్న, పెద్దన్న బోనాలు**

చెన్నూర్‌రూరల్: మండలంలోని నాగాపూర్‌లో బుధవారం చిన్నన్న, పెద్దన్న బోనాలు పోసి ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మేకలు, కోళ్లు బలిచ్చారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు భాగా పండాలని, పిల్లాపాపలు సల్లంగ ఉండాలని వేడుకున్నారు.

- **జలాభిషేకం**

వేమనపల్లి: మండల కేంద్రంలోని బెస్తవాడలోని ఊరపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధమైంది. మహిళలు మంగళహారతులు, భాజభజంత్రీల మధ్య నూతన విగ్రహాలతో బుధవారం పెద్ద ఎత్తున భక్తులు ప్రాణహిత నది జలాభిషేకానికి తరలివెళ్లారు.

- **వానలు కురవాలని పాండవుల కల్యాణం**

జైపూర్: మండలంలోని వేలాలలో ప్రసిద్ధిగాంచిన శ్రీ గట్టు మల్లన్న స్వామి క్షేత్రంలో పాండవుల గుట్టపై వరుణుడు కరుణించాలని, వానలు కురవాలని, పంటలు సంవృద్ధిగా పండాలని పాండవుల కల్యాణం జరిపించారు. ఒగ్గు పూజారుల నేతృత్వంలో బుధవారం గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కడవల్లో నీళ్లు తీసుకువచ్చి గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. అనంతరం పాండవుల కల్యాణం జరిపించి గాలి పిల్లలను వదిలిపెట్టి గొంతెమ్మ కొలిగుంట వద్ద వరద పాశం పోసి వరుణ దేవుడు కరుణించాలని పూజించారు. కార్యక్రమంలో ఒగ్గు పూజారులు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు



జైపూర్: మండలంలోని గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారింది. గుంతల్లో వర్షపు నీరు నిల్వడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రసూల్‌పల్లి నుంచి ముదిగుంట మీదుగా గుడిపల్లి, పొన్నారం, ఆదిల్‌పేట్, చిర్రకుంట మీదుగా మందమర్రికి నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ముదిగుంట, కాన్కూర్, మధ్యన బీటీ రోడ్డు పూర్తిగా చెదిరిపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సులు తక్కువ.. ప్రయాణికులెక్కువ



భీమారం: చెన్నూరు-మంచిర్యాల రూట్లో ఆర్టీసీ బస్సులు తక్కువగా నడప డం వల్ల ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చెన్నూర్‌లోనే బస్సులు ప్రయాణికులతో నిండిపోవడంతో మధ్యలో గల భీమారంలో బ స్సుల కోసం వేచి ఉండే వారి పరిస్థితిపై పలువురు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసికెళ్లినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. మరికొందరు ప్రైవే టు వాహనాలు ఆశ్రయిస్తూ, ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా బస్సు ల సంఖ్య పెంచి ఆర్టీసీ సేవలందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు



చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో మంచిర్యాల-చెన్నూర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెట్టు ఎండిపోయి కొమ్మలన్నీ రోడ్డుపైకొచ్చి ప్రమాదకరంగా మారింది. అసలే వర్షాకాలం గాలి దుమారానికి లేదా భారీ వర్షానికి చెట్టు రోడ్డుపై పడిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు పట్టించుకొని ఎండిపోయిన చెట్టును తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రోడ్డు అసంపూర్తి..!



భీమారం: మండలంలోని మద్దికల్ నుంచి ఎలకేశ్వరం వరకు రెండేళ్ల క్రితం చేపట్టిన బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మూడు కిలోమీటర్ల పొడువు బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉండగా, సగం మాత్రమే చేసి, మిగితా రోడ్డును కంకరపోసి వదిలిపెట్టారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అధికారులు సత్వర చర్యలు తీసుకొని, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

- **సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన**

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అధికారులు సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్ మాట్లాడారు. రక్త పరీక్షల ద్వారా దీనిని గ్రహించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ అధికారి నాందేవ్, పీహెచ్‌సీ వైద్యాధికారి సతీశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, వార్డెన్ మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

బెల్లంపల్లి(తాండూర్): ఉపాధ్యాయ సమస్యలపై దశాబ్దాల నుంచి తమ సంఘం అలుపెరుగని పోరాటాలు సాగిస్తోందని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు అన్నారు. తాండూర్ మండలం రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు సభ్యత్వాన్ని స్వీకరించారు.

- **పాఠశాలలో కౌన్సిల్ ఎన్నికలు**

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. పాఠశాలలోని మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొన్నారు. కెప్టెన్‌గా ప్రసన్న విజయం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ తెలిపా రు. కార్యక్రమంలో పీడీ జీవరత్నం, వార్డెన్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **పంటల పరిశీలన**

కాసిపేట: మండలంలోని మల్కేపల్లి శివారు రైతుల పంటలను బుధవారం ఏవో ప్రభాకర్ పరిశీలించి ఎరువుల యాజమాన్యం, చీడ పీడల సస్యరక్షణ చర్యలు, అంతర్ పంటలపై అవగాహన కల్పించారు.

- **విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇవ్వాలి**

కాసిపేట: విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని, ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, కార్తీక్, రవికుమార్, శోభన్, విఘ్నేష్, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

- **ఘనంగా కార్మెల్ డే**

మంచిర్యాలఅర్బన్: స్థానిక కార్మెల్ హైస్కూల్లో కార్మెల్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. కార్యక్రమంలో డేనియల్, మథర్ మరియా అగస్టిన్, కార్మెల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ సారూప్య, సీబీఎస్‌ఈ ప్రిన్సిపాల్ రినెట్ తదితరులు పాల్గొన్నారు.